క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రించాలని వినతి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంటుందని, పల్లిపేట కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నవీన్‌కు నరసన్నపేట సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో వినతి పత్రం అందజేసినట్లు సొసైటీ ప్రతినిధులు పుచ్చల విశ్వేశ్వరరావు, పూర్ణారావు, మురళీధర్ తెలిపారు. పల్లిపేట, కంబకాయ, కాలేజీ రోడ్డు జంక్షన్లతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద హోం గార్డులను నియమించాలని కోరారు. జమ్ము కూడలి వద్ద స్పీడ్ బ్రేక్లు వేయించాలన్నారు. పల్లిపేట కూడలి వద్ద ఏపీఎస్ ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌ను అధికారులు మంజూరు చేశారని, ఇక్కడ అమలాపురం, రాజమండ్రి బస్సులను రాత్రి సమయాల్లో నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఎస్ఐ సంధ్యారాణి

నరసన్నపేట: మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనం అవుతాయని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, ఎస్‌ఈబీ ఎస్ఐ సంధ్యారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలు అయినవారు తల్లిదండ్రులకు, సమాజానికి దూరమవుతారన్నారు. ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్తున్న ఏపీ ప్రభుత్వ ఆశయాలను యువత సార్థకం చేయాలని సూచించారు. డ్రగ్స్ సేవించడం, కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని ఎస్ఐ హెచ్చరించారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, అధ్యాపకులు జి.రవికుమార్, పి. అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన ఉపాధ్యాయునికి సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న డ్రీమ్ ఆర్ట్ అకాడమీ సభ్యులు

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జన్ని రమేష్‌కు ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు సన్మానించినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. పాఠశాలలో చిత్రలేఖనం విద్యార్థులకు ఉత్తమ శిక్షణిస్తున్నందుకు తనను గుర్తించి ఈ సన్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేత్ర చికిత్సలకు 92 మంది ఎంపిక



తనిఖీలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ సిబ్బంది

నరసన్నపేట: స్థానిక చిత్తిరి వీధిలోని సత్యసాయి మందిరంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరంలో 92 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామని పోలాకి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ ఆఫీసర్ బాలగంగాధర రాజు తెలిపారు. సత్యసాయి సేవా సమితి, ఎలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం సోమవారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి 210 మంది కంటి రోగులు తనిఖీల కోసం వచ్చారు. వీరిలో కంటి శుక్లాలతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. 50 మందికి ఆపరేషన్‌కు తీసుకువెళ్లాగా.. మిగిలిన వారికి గురువారం తీసుకువెళ్లి ఆపరేషన్లు చేసి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తామని కంటి వైద్యుడు తెలిపారు. సత్యసాయి మందిరం కన్వీనర్ నాగేశ్వరరావు, ఎలియన్స్ క్లబ్ ప్రతినిధి కె.ఎల్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

కొత్తూరు: మండలంలోని కుంటిభద్రలో గల లక్ష్మీగణపతి ఆలయం ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోగుల వరప్రసాదరావు, మాధవి దంపతులు ప్రతిష్టను శాస్త్రోక్తంగా చేపట్టారు. శాంతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలోని చోడవరపు వీధికి చెందిన యువకుల ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ అగతమూడి రంజిత్, బి.లోకేష్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళాభ్యుదయం



పాతపట్నం: వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నంలో ఆసరా నమూనా చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- నియోజకవర్గంలోని 4,500 సంఘాలకు రూ.25.40 కోట్ల లబ్ధి



ఆమదాలవలస రూరల్: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రభాకరరావు, మహిళలు

పాతపట్నం: మహిళలను మహారాణులుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్ ఆసరా సంబరాలను డ్వాక్రా మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా కింద నగదును సీఎం జగన్ జమ చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫీ పేరుతో మహిళలను మోసం చేశారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులు కూడా సీఎం జగన్ తీరుస్తున్నారన్నారు. జగనన్నకు మహిళలు అండగా నిలవాలన్నారు. నియోజకవర్గంలోని 4,500 సంఘాల్లోని 47,431 మంది సభ్యులకు రూ.25.40 కోట్లు మూడో విడతలో ఖాతాలకు జమ చేశారన్నారు. మూడో విడత కింద మంజూరైన వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. మెళియాపుట్టి, కొత్తూరు జెడ్పీటీసీలు గూడ ఎండయ్య, కె.భాగ్యలక్ష్మి, ఎంపీపీలు దోర సావిత్రమ్మ, జ్యోతిలక్ష్మి, వెలుగు ఏపీడీ నారాయణరావు, ఐసీడీఎస్ పీఓ పార్వతి, తహసీల్దార్ రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, మీసాల రామకృష్ణ, కె.త్రినాథరావు, మెళియాపుట్టి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, జి.సూర్యం, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల ఎంపీడీఓలు, ఏపీఎంలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే వైఎస్సార్ ఆసరా..

ఆమదాలవలస రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేసిందని మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు అన్నారు. మండలంలో అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట గ్రామాల్లో ఆసరా వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘాలకు వచ్చిన డబ్బులతో మహిళలు వ్యాపారాలు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. క్లస్టర్ కో ఆర్డినేటర్లు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా దాసునాయుడు



ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాతపట్నం అధ్యక్షుడిగా పి.ఎస్.దాసునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాతటపట్నం కోర్టు కూడలిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించినట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకాశరావు, నర్సింహమూర్తి, సోమసుందరావు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఆర్.ఆనందరావు, సెక్రటరీగా మృత్యుంజేయరావు, గౌరవ అధ్యక్షుడిగా వై.ఎస్.ప్రకాశ్, ట్రెజరీగా ఆర్.నారాయణమూర్తి, పలువురు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన సభ్యులు ప్రమాణం స్వీకారం చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



జలుమూరు: చల్లవానిపేటలో మాట్లాడుతున్న సీడీపీఓ రూపాలత

పాతపట్నం: ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలు సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డులో ఐసీడీఎస్ పీఓ పార్వతి ఆధ్వర్యంలో పోషకాహారం స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణిలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలుమూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మాతాశిశుమరణాల నివారణ సాధ్యమవుతుందని కోటబొమ్మాళి సీడీపీఓ కె.రూపాలత అన్నారు. చల్లవానిపేట క్లస్టర్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో సోమవారం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. నెలవారీ వైద్య పరీక్షలు, బరువులు తూయించి అనవసరమైన మందులు, రక్తహీనత అరికట్టడం తదితర కార్యక్రమాలు విధిగా చేయాలన్నారు. ఆయా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో ఔషధ గుణాలు అధికం



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సరుబుజ్జిలి: చిరుధాన్యాల్లో ఔషధ గుణాలు అధికంగా ఉండడం వల్ల వీటిని తీసుకున్నవారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వైకేపీ ఏపీఎం కమల కుమారి పాండ్యన్ తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా మండలంలోని చిగురువలస గ్రామంలో మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, రక్తపోటు, గుండె జబ్బులు, సుగర్, మూత్రపిండాలు తదితర వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. సీసీ రోజాలత, సీఎఫ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సోమవారం సాయంత్రం తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్దానం ప్రాజెక్టు-2లో భాగంగా నియోజకవర్గానికి తాగునీటి సమస్య లేకుండా రూ.265 కోట్లు నిధులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. పాతపట్నం మండలంలోని 112, మెళియాపుట్టి మండలంలోని 153, కొత్తూరు మండలంలోని 64, హిరమండలం మండలంలోని 59, ఎల్.ఎన్.పేట మండలంలోని 61 గ్రామాలకు తాగునీరు అందించనున్నట్లు ఆమె చెప్పారు. ఉద్దానం ప్రాజెక్టు-2లో అంచనాలు వేయడం జరిగిందన్నారు. డీఈఈ జి.మధుసూదనరావు, జేఈ కల్యాణ్, ప్రాజెక్టు జేఈ ముఖేష్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో అదనపు ఆదాయం

- అమూల్‌తో ప్రభుత్వం ఒప్పందం
- పెరిగిన పాల ధర
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



లేగ దూడలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: పాడి పరిశ్రమతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని తొగిరి గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ రైతు పశువుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అమూల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పాల ధరను పెంచారానన్నారు. జిల్లాలో లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, దానిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే వాటిని కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి సూచించారన్నారు. పశుసంవర్థక శాఖ జేడీ ఎం.కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 12 లేగ దూడల ప్రదర్శనలు నిర్వహించామని, మరో 12 ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ఆడ దూడలను పుట్టించేందుకు 5 వేల డోసులున్నాయని, వాటిని సబ్సిడీపై రూ.500లకు వేస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ఒంగోలు, పుంగనూరు, తదితర మేలు జాతి సంతతిని పెంపొందించవచ్చునన్నారు. లంపీ స్కిన్ వ్యాధిని జిల్లాలో పూర్తిస్థాయిలో నివారించగలిగామన్నారు. ఈడీఎల్‌డీ డాక్టర్ మన్మధరావు, డీడీ వి.జయరాజ్, పశువైద్యులు చల్లా కిషోర్, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు చల్లా తాతయ్య, బాడాన కృష్ణారావు, ఎంపీటీసీ రావాడ జ్ఞానేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పంచిరెడ్డి సూర్యనారాయణ, నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్, రావాడ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



గాజులకొల్లివలస బస్‌షెల్టర్‌లో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజులకొల్లివలస జంక్షన్‌లో గల బస్‌షెల్టర్‌లో నెలకొన్న అపరిశుభ్రతను పంచాయతీ అధికారులు సోమవారం తొలగించారు. అధ్వానంగా బస్‌షెల్టర్ వార్త సోమవారం సాక్షిలో ప్రచురితం కావడంతో దీనిపై ఎంపీడీఓ ఎం.రేణుక స్పందించారు. పంచాయతీ కార్యదర్శికి చెత్తను తొలగించాలని సూచించారు. గ్రామ పంచాయతీలో గల పారిశుద్ధ్య కార్మికులు బస్‌షెల్టర్‌లో ఉన్న చెత్త, మద్యం సీసాలను తొలగించి పరిశుభ్రం చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



రొట్టవలస జంక్షన్‌లో ఏర్పాటు చేసిన స్టాప్‌బోర్డు

సరుబుజ్జిలి: ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నంకాకుండా అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు తెలిపారు. మండలంలోని రొట్టవలస నుంచి బప్పడాం జంక్షన్ వరకు ఆర్‌అండ్‌బీ రహదారిలో ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో స్టాప్ బోర్డులు సోమవారం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేటినుంచి చిట్టివలసలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

ఆమదాలవలస రూరల్: మండలంలోని చిట్టివలసలో మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు పీఓ జలుమూరు రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణతోపాటు ప్రజలను చైతన్యవంతులు చేసే అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

న్యాయం చేయాలి

కొత్తూరు: మురుగు నీటిని పొలాల్లో (జిరాయితీ) విడిచిపెట్ట వద్దుంటూ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో కొత్తూరుకు చెందిన ఎస్.లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, జోగినాయుడుతోపాటు పలువురు రైతులు జేసీ నవీన్‌కు ఫిర్యాదు చేశారు. మురుగునీరు వెళ్లేందుకు ప్రత్యమ్నాయ అవకాశాలు ఉన్నప్పటికీ తమ భూములపై నుంచి విడిచిపెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మురుగునీరు పొలాల పైనుంచి వెళ్లడం వల్ల పంటలు నాశనం అవుతాయన్నారు. కోర్టులో వివాదం ఉన్నప్పటికీ తమ భూములు పైనుంచి మురుగు నీరు విడిచిపెట్టేందుకు అధికారులు చర్యలు చేపడతున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

అన్నదాతకు ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- సహకార సంఘాల బలోపేతానికి చర్యలు
- పీఏసీఎస్ మహాజనసభలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: అన్నదాతలకు అన్నిరకాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మహాజన సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తే.. వాటి అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టి చేయూతనిచ్చారని గుర్తుచేశారు. పీఏసీఎస్‌లు ఎంత బలంగా ఉంటే రైతులకు అంతగా ఉపయోగపడతాయన్నారు. ప్రతిసభ్యుడూ విధిగా రుణాలను పొంది సకాలంలో చెల్లించటం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సున్నావడ్డీతో పాటు వివిధ రాయితీలు పొందవచ్చున్నారు. పోలాకి పీఏసీఎస్ ద్వారా దాదాపు రూ.25కోట్లు టర్నోవర్ జరిగిందని సీఈఓ రాంబాబు ప్రకటించటంతో సిబ్బందిని, పాలకవర్గాన్ని, రైతులను ఎమ్మెల్యే అభినందించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి, రైతుసంఘ నాయకులు పాగోటి అప్పారావునాయుడు, సంఘసభ్యులు మిరబ్బిల్లి వెంకటప్పలనాయుడు, మజ్జి లక్ష్మీనారాయణ, తూలుగు అశోక్, గొండు విశ్వనాథం, లుకలాపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇకపై అంతా ఆన్‌లైన్‌లోనే..

మహాజనసభ అనంతరం పోలాకి పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మాట్లాడారు. జిల్లా మొత్తం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పీఏసీఎస్‌లను ఆన్‌లైన్ చేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు ప్రమాదవశాత్తు మృతి చెందితే సంఘం ద్వారా అందించే ఇన్సురెన్స్‌ను లక్ష నుంచి రెండు లక్షలకు పెంచినట్లు తెలిపారు. ప్రతి మండలంలోనూ ఒక రైస్‌మిల్లు పీఏసీఎస్‌ల ద్వారా నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చే ఆదాయం సిబ్బంది నిర్వహణతోపాటు సంఘాల అభివృద్ధికి ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. డీసీసీబీ జిల్లా మేనేజర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. జిల్లాలో డీసీసీబీల ద్వారా ఈ ఏడాది 2,100 కోట్లు టర్నోవర్ జరిగిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5 వేల కోట్లు టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువతకు రూ.25 లక్షలు వరకు నిబంధనలు ప్రకారం రాయితీ రుణాలు మంజూరుచేస్తామన్నారు. బంగారు రుణాలకు తమ బ్యాంకుల్లో మంచి స్పందన ఉందని, గతంలో పోల్చితే ఈ ఏడాది వృద్ధిరేటు బాగుందని వివరించారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం



పాతపట్నంలో కురుస్తున్న వర్షం

పాతపట్నం: మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. అచ్చుతాపురం, ప్రహరాజపాలేం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, రొంపివలస, గంగువాడ తదితర గ్రామాల్లో వర్షం పడింది.

ఎల్.ఎన్.పేట: ఈదురగాలులతోపాటు మేఘాలు కమ్మేశాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాసింది. సాయంత్రం 6 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురగాలులు ప్రారంభం కావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలులతోపాటు కుండపోతగా వర్షం కురిసింది. జీడి, మామిడికి అపార నష్టం జరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన సోమవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ఏసీడీపీ నిధుల నుంచి తనవంతుగా రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంట్లో ప్రతీ పంచాయతీకి లక్ష చొప్పున కేటాయిస్తూ రూ.15 లక్షలు మండల పరిషత్ ఆధ్వర్యంలో ఉంచనున్నట్లు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు ఈ ఏడాది ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉంటుందని, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రతీ గ్రామంలోనూ తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి వనరులు పాడైతే వెంటనే స్పందించేందుకు మండల పరిషత్ ప్రత్యేక రికార్డులో నమోదు చేసి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

నరసన్నపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందివ్వాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రానున్న ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే కాలువలను అభివృద్ధి చేయాలని వంశధార ఏఈ సురేష్‌కు పలువురు సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 4 నుంచి ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు కానుందని ప్రజలందరూ వినియోగించుకోవాలని మాకివలస, ఉర్లాం వైద్యాధికారులు దుష్యంత్, అరవింద్ తెలిపారు. ఇకనుంచి 104 వాహనం ప్రతీ సచివాలయానికి నెలలో రెండు రోజులు వస్తుందన్నారు. గడ్డి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని కంబకాయ పశువుల డాక్టర్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెలఖరు వరకు నట్టల నివారణకు టీకాలు వేస్తామన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా రూ.35 కోట్లతో పలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు ఎంఈఓ శాంతారావు వివరించారు. ఉర్లాం పంచాయతీ పరిధిలోని చింతువానిపేట, బడ్డవానిపేటల్లో మంచినీటి సరఫరా సక్రమంగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌భాస్కర్ దృష్టికి సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి తీసుకువెళ్లారు. జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పరీక్ష మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం హేమనాచార్యులు, తదితరులు

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 59 మంది విద్యార్థులకు హెచ్‌ఎం ఎల్.హేమనాచార్యులు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుపై శ్రద్ధ కనబర్చలన్నారు. మెట్ట అనంత భట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31తో ధాన్యం కొనుగోలుకు గడువు పూర్తి

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ కాలంలో సాగుచేసిన వరిపంట (ధాన్యం) కొనుగోలుకు ఈ నెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం, పట్టణంలో గల 22 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ పంట కాలంలో ఈ ఏడాది 17461 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 17134 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2022-23 పంట కాలం మార్చి 31తో ముగుస్తున్నందున రైతులు ధాన్యం విక్రయించాలనుకుంటే సమీప రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్లి ప్రసాద్ కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను కొత్తూరులో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులను రిగ్యులర్ చేయాలన్నారు. ఉపాధి పనులు ప్రతీ కుటుంబానికీ ఏడాదికి 200 రోజులు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



గొయ్యి వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన రాళ్లు

ఆమదాలవలస రూరల్: మండలంలో పొన్నాంపేట గ్రామం సమీపంలో పురుషోత్తపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో కల్వర్టు కూలిపోవడం వల్ల గొయ్యి ఏర్పడింది. ఈ రహదారిలో సుమారు 20 గ్రామాల ప్రజలు ఆమదాలవలస పట్టణానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ప్రయాణాలు చేస్తుంటారు. ఈ సమస్యపై స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో పొన్నాంపేట గ్రామానికి చెందిన కొందరు యువకులు గొయ్యి ఉందని సూచించడానికి సున్నం మార్కు వేసి హెచ్చరికలు పెట్టారు. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.